క్లుప్తంగా

సంత షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సంతషెడ్లను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వారపు సంతల్లో రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటుచేసి వాహనదారులకు ఇబ్బంది పెట్టకూడదని పిలుపునిచ్చారు. నాబార్డు, పంచాయతీ నిధులతో 40 షెడ్లను నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని షెడ్లను నిర్మిస్తామని, గిరిజనులు, వర్తకులు సహకరించాలని ఆమె కోరారు. పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ అంబేద్కర్, వలంటీర్ల మండల అధ్యక్షుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

చింతపల్లిరూరల్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గిరిజనులకు ఉపాధి కలుగుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. గూడెం కొత్తవీధి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరిగేలా అధికారులు కార్యచరణ చేయాలని సూచించారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. హార్టీకల్చర్ మొక్కలను సంరక్షించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అందరూ పనిలోకి వచ్చేలా చూడాలన్నారు. ఏపీవో రాం ప్రసాద్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎటపాక: మండలంలోని పట్టుచీర గ్రామంలో చర్చి ఫాదర్ పీటర్ సింగయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. తెలంగాణాలోని సిద్దిపేట జీబీఎం మిషనరీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పట్టుచీర, కన్నాపురం, కృష్ణవరం, రంగాపురం, లక్ష్మీపురం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేశ్వరరావు, మిషనరీ డైరెక్టర్ జెస్సీ, కో–ఆర్డినేటర్ రవి, వైద్యులు జోయెల్‌బాబు, సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: జీలుగు చెట్టుపై నుంచి జారీపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైయ్యాయి. మండలంలోని పూసిలోవ గ్రామానికి చెందిన అబ్బాయి రెడ్డి తన ఇంటి సమీపంలోని జీలుగు చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాస్తూ జారీ కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. గాయపడిన వ్యక్తిని బంధువులు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: రంగిలిసింగి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో పూజలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. సీతారాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని విశాఖపట్నానికి చెందిన ముత్య సుబ్రహ్మణ్యం.లక్ష్మి, గణేష్, కరుణ దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో గిరిజనులకు రక్ష

- గ్రామాల్లో వైద్య శిబిరాలు
- తరలివచ్చిన గ్రామస్తులు



శరభవరంలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



కోయ్యూరులో శిబిరానికి వచ్చిన గ్రామస్తులు



కూనవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామంలోని సబ్‌సెంటర్‌లో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పంచాయతీ పరిసర గ్రామాల నుంచి వచ్చిన దాదాపు 128 మంది ఈ శిబిరంలో వైద్యసేవలు పొందారు. స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుష్మా, చిన్న పిల్లల వైద్య నిపుణులు జీవన్ ఈ శిబిరంలో సేవలందించారు. ఏడుగురు గర్భవతులను పరీక్షించి అవసరమైన ఆరోగ్యసూత్రాలు తెలియజేశారు. 186 మందికి రక్త పరీక్షలు చేశారు. వీరిలో 98 మందికి ర్యాండమ్ బ్లడ్ సుగర్, 86 మందికి హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో గిరిజనులకు రక్ష అన్నారు.

ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, మాజీ సర్పంచ్ లోతా లక్ష్మణరావు, సచివాలయ సెక్రటరీ కిషోర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. సీహెచ్‌ఓలు దేవి, రామారావు, సంపత్, ఏఎన్ఎం సత్యవతి, ఆశ వర్కర్లు సత్యవతి, వెంకటలక్ష్మి, సరస్వతి, రత్నం, కిరణ్, ఫార్మసిస్ట్ అప్పారావు, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొమ్మికలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.నర్సీపట్నం, ఇతర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులు విచ్చేశారు. నర్సీపట్నం నుంచి వచ్చిన గైనకాలజిస్టు సుధా శారదా మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కొమ్మిక ఆశ్రమ పాఠశాల బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. వైద్యులు ప్రసాద్, చందన, భాగ్యలక్ష్మి, ఆర్‌వీ రమణ, సర్పంచ్ సెగ్గే సూరిబాబు, సామాజిక సేవకుడు అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం నిర్వహించిన ఈ శిబిరంలో కంటివైద్య పరీక్షలు, గైనిక్ సమస్యలు, జనరల్ ఓపీ, సర్జరీకి సంబంధించిన సమస్యలపై సుమారు 260 మంది పైగా రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సరల్ సర్జన్ డాక్టర్ మహేష్, గైనకాలజిస్ట్ శ్వేత, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సునీల్ కుమార్, రాజీవ్, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, వలంటీర్లు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



కంగువలసలో ప్రభుత్వ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చింతగరువులో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

అరకులోయ టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీటీసీ సభ్యులు స్వభి రామచందర్, పూర్ణ, కిల్లో నిబో, సమర్ధి శత్రుఘ్ను తదితరులు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మండంలోని ఇరగాయి పంచాయతీ కంగువలస, కందుల్‌గుడి గ్రామాల్లో వారు మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. నాలుగున్నరేళ్లల్లో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గ్రామస్తులకు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన తదితర పార్టీల నాయకులు వచ్చి మోసపూరిత వాగ్దానాలు చేస్తారని నమ్మవద్దని స్పష్టం చేశారు. నాయకుడు రామారావు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని గిన్నెలకోట పంచాయతీ చింతగరువులో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్టు చెప్పారు. జగనన్న ప్రభుత్వంలోనే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో గ్రామాలకు తారురోడ్డు సదుపాయం కలిగిందన్నారు. టీడీపీ నాయకులు గ్రామాలకు వస్తే తరిమివేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంగరం, గుల్లేలు మాజీ సర్పంచ్‌లు ప్రసాద్ నాయుడు, నాగరాజు, నాయకులు శ్రీను, బాబూరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



బంగారుమెట్టలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పూజారి మేరీ, ఎంపీటీసీ మీనా



సిమిలిగుడలో గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసి జానకమ్మ



కన్నాయిగూడెంలో రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కామేశ్వరి

హుకుంపేట: మండలంలోని మత్స్యపురం పంచాయతీ బంగారుమెట్ట గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులను సర్పంచ్ పూజరి మేరీ, ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తుందన్నారు. నాయకులు సుబ్బారావు, సాంభ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ(అరకులోయ టౌన్): మండలంలోని గసభ పంచాయతీ సిమిలిగుడ గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ మంగళవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో భాగంగా గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో రూ.65 లక్షల నిధులు మంజూరైనట్టు వారు చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగనన్న ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నాయకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని కన్నాయిగూడెం గ్రామ పంచాయతీలో రహదారి నిర్మాణ పనులను ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత మంగళవారం ప్రారంభించారు. జగనన్న పాలనలోనే గ్రామాల రహదారులకు మోక్షం కలిగిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు వర్షా బాలకృష్ణ, సర్పంచ్ పెనుబల్లి నాగమణి, మాజీ సర్పంచ్ ఎర్రయ్య, భాస్కర్, ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

వీఆర్ పురం: రాజుపేట సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రానికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు హాజరై వలంటీర్లను సన్మానిస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారధులు హాజరుకావాలని కోరారు.

త్రాచు పాము కలకలం



ఇంట్లోకి ప్రవేశించిన త్రాచుపాము

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులోని ఓ ఇంట్లో త్రాచుపాము ప్రవేశించి కలకలం సృష్టించింది. సుమారు ఏడు అడుగుల గోధుమ రంగులో గల త్రాచుపాము ఇంట్లో ప్రవేశించడాన్ని గమనించిన కుటుంబసభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానిక యువకులు ఇంట్లో పొగపెట్టడంతో కిటికీ ద్వారా పాము బయటకు వెళ్లి పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వైఎస్సార్ పశు బీమాతో ఆర్థిక భరోసా



బాబుశాలలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఏడీ రాజా రవికుమార్



దేవరమడుగులలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశువైద్యాధికారి వీరేంద్ర

ముంచంగిపుట్టు: వైఎస్సార్ పశు బీమాతో రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రాజారవికుమార్ అన్నారు. మండలంలోని బాబుశాల పంచాయతీ కేంద్రంలో మంగళవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. గాలికుంటు వ్యాధి టీకాలు–59 పశువులకు, పీపీఆర్ వ్యాక్సిన్‌లను –86 గొర్రెలు, మేకలకు వేశారు. అనంతరం వైఎస్సార్ పశు బీమా, 1962 అంబులెన్స్ సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పశువులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. ఏడీ డాక్టర్ రాజారవికుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ పశు బీమాను ప్రతి ఒక్క రైతు చేయించుకోవాలని, స్వల్ప ప్రీమియంతో అధికంగా లబ్ధి పొందవచ్చన్నారు. ఈ బీమా వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రమాదవశాత్తూ పశువులు మృతి చెందిన పశు వైద్యాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పశు వైద్య సిబ్బందికి రైతులు సహకరించాలని ఆయన కోరారు. పశు వైద్యాధికారి సౌజన్యదేవి, సిబ్బంది రఘురాం, రఘునాథ్, రాజు, రమేష్, వెంకట్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని దేవరమడుగుల గ్రామంలో పాడిరైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి యు.వీరేంద్ర మాట్లాడుతూ ప్రతి రైతు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ పశు బీమా లబ్ధి చేకూరే వివరాలను తెలియజేశారు. ఈ పథకం వర్తించే పశువులు, తదితర జీవాల వివరాలను తెలిపారు. ప్రతీ రైతు తమ పశువులకు బీమాను చేస్తే వాటికి ఏ ప్రమాదం జరిగినా, బీమా సొమ్ము మంజూరవుతుందన్నారు. పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటువ్యాధి టీకాలను వేయించుకోవాలని కోరారు. ఈ వ్యాధి లక్షణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పశువులకు అందిస్తున్న పథకాలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి వీరేంద్ర కోరారు. పశువులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా, మండలంలోని ప్రతీ సచివాలయంలో ఉన్న యానిమల్ హజబెండ్రీ అసిస్టెంటుల ద్వారా తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. వెటర్నరీ అసిస్టెంటులు ముత్తయ్య, చైతన్య, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



సాధించిన పతకాలతో క్రీడాకారులు

పెదబయలు: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని పాఠశాల హెచ్ఎం టి.నాగేశ్వరరావు అన్నారు. పెదబయలు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–2 మైదానంలో విశాఖకు చెందిన నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. వాలీబాల్, ఖోఖో పోటీల్లో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ పోటీల్లో సీతగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర–2 విద్యార్థులు ప్రథమ స్థానంలో, గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల–2 విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయా విద్యార్థులకు హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. హెచ్ఎంలు ఎస్.మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు సాధురాం, కోటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

జి.మాడుగుల: మండలంలోని జీఎం కొత్తూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల–2లో చదువుతున్న పాడేరు ఆస్పత్రిలో సికిల్‌సెల్ ఎనీమియాతో చికిత్స పొందుతున్న విద్యార్థి శ్రీనుని మంగళవారం ఏటీడబ్ల్యూవో ఎ.తిరుపాల్ ఆరోగ్య పరిస్థితి పరిశీలించారు. ఈ ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుతూ గత కొన్ని రోజులుగా సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతుండడంతో పీహెచ్‌సీ డాక్టర్లు పాడేరు జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థి పాండి శ్రీను ఆరోగ్యం, అందుతున్న వైద్య సదుపాయం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం ప్రదీప్ ఉన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: కొండగోకిరి కొండపై నిర్మించిన ఆలయంలో కోటకొండమ్మ తల్లి విగ్రహాన్ని మంగళవారం ప్రతిష్టించారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటకు చెందిన రెడ్డి ఎర్నాయుడు కుటుంబం అందించిన రూ.3లక్షల విరాళంతో ఆలయాన్ని నిర్మించి, విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

సమావేశంలో సమస్యలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లోహిత్ జయసాగర్

జి.మాడుగుల: స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతను మంగళవారం జరిగింది. మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసి పారదర్శక పాలన అందించేందుకు అధికారులు దృష్టి సారించాలని కోరారు. వచ్చే నెలలో జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ శశికాంత్ కోరారు. గర్భిణులకు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించాలని సూచించారు. ఆస్పత్రుల్లో కొంతమంది సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, ఫేషియల్ అటెండెన్స్‌కు మాత్రమే వచ్చి పాఠాలు బోధించడం లేదని, బోయితిలి పంచాయతీలో ఓ టీచర్ విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నట్టు సర్పంచ్ మాలన్న, సభ్యులు ప్రస్తావించారు. ఎంపీడీవో లోహిత్ జయసాగర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు రూ. రూ.71,36,560 కేటాయించినట్టు ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, కళ్యాణి, ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, పాంగి లక్ష్మి, కె.అప్పలరాజు, అప్పారావు, కూడా చిన్నారావు, రవనీ, నానాజీ, ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, కిముడు రాంబాబు, మాలన్న, సూరిబాబు, చినకుమారి, చిలకమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శశికాంత్, డాక్టర్ బాబ్జి, డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పలస్వామి, టిడబ్ల్యూ ఏఈ దేముడు, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ ఎం.వి.రమణ, జీసీసీ ఎంఎస్ బ్రాంచి మేనేజర్ కొండబాబు, ఐకెపీ ఏపీఎం సుందరమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీఎం కొండబాబు, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి ఉత్సవాలు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో శ్రీ గంగమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం రాత్రి గిరిజన సంస్కృతి సంప్రదాయల ప్రకారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గంగమ్మతల్లి ఆలయంలో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యల్లో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచ్‌లు గంగాధర్, రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నేతలు గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మికి అభినందనలు



అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

అరకులోయ టౌన్: ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో బెస్ట్ హ్యూమనిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డు–2024ను అరకులోయ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో, సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ డైరెక్టర్ విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీరామ్మూర్తి, వరుణ్ హెల్త్ సెంటర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బంగార్రాజు, ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారి ట్రస్టు ప్రతినిధి బి.కె.రాజేశ్వరి తదితరులు విజయలక్ష్మికి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న అధికారి కైలాష్

చింతపల్లిరూరల్: సీజనల్ వ్యాధులు పట్ల గిరిజనులకు అవగాహన కల్పించాలని జిల్లా ట్రాష్ ఫోర్స్ అధికారి జె.కై లాష్ అన్నారు. గూడెం కొత్తవీధి మండలంలో దేవరాపల్లి సచివాలయ పరిధిలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–5 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయాలని ఏఎన్ఎమ్, ఎమ్ఎల్‌హెచ్‌పీలకు సూచించారు. ఎక్కువ సంతానం కలిగి ఉన్న వారికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స కోసం అవగాహన కల్పించి, వారికి చికిత్స చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలు లోపు గర్భిణులకు ఎర్లి రిజిస్ట్రేషన్ చేయించి, వారికి టీడీ వ్యాక్సిన్ వేయాలని ఈ విషయంపై ఆశ కార్యకర్తలు శ్రద్ధ వహించాలని సూచించారు. డీటీ సతీష్, డీటీపీవో సింహాచలం, ఈవో లింగేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

అనంతగిరి: మండలంలోని మర్ధగుడ సమీపంలోని చాపరాయి మలుపువద్ద మంగళవారం లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది.. ఒడిశా నుంచి తినుబండరాల లోడ్‌తో లారీ విశాఖపట్నం వెళుతుండగా మండలంలోని చాపరాయి మలుపువద్ద వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. జాతీయ రహదారి ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో బోర్డులు ఏర్పాటుచేయడంతోపాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.